## క్లుప్తంగా

### కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

మాజీ మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీలో కష్టపడే నాయకులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ తెలిపారు. జిల్లాస్థాయిలో వివిధ విభాగాలకు నియమితులైన వారిని సోమవారం ఆయన అభినందించి శాలువాతో సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి పఠాన్ నాగులుమీరా, కార్యదర్శి షేక్ జియాఉల్, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గోగినేని సాంబశివరావును అభినందించారు. నియోజకవర్గంలో ఆయా విభాగాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సర్నాల తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

### నేడు అన్నదాత పోరు

నూజివీడు: రైతులకు అండగా పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ద్వారకా ఎస్టేట్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. అనంతరం శ్రీనివాసా సెంటర్‌లో రైతుల సమస్యలపై బహిరంగ సభ జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### చంద్రగ్రహణం వీక్షించిన విద్యార్థులు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెలీస్కోప్‌లో చంద్రగ్రహణంలోని వివిధ దశలను విద్యార్థులు తిలకించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్ చంద్రగ్రహణం ఎలా ఏర్పడుతుంది.. రెడ్‌మూన్ ప్రత్యేకతను వివరించారు. సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను వీడాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

### పాఠశాలకు మోటరు వితరణ

చాట్రాయి: మండలంలోని చనుబండ మెయిన్ ప్రాథమిక పాఠశాల పూర్వపు విద్యార్థి చెరుకు శ్రీనివాసరావు సోమవారం సుమారు రూ.26 వేలు విలువ చేసే మోటారుని స్కూలుకి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షహనాజ్, ఎంఈఓ–1 మాసగిరి శ్రీనివాసరావు, ఎంఈఓ–2 వీఎస్‌వీ బ్రహ్మాచారి పాల్గొన్నారు.

### యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మునునూరు: యోగా పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ చూపారని ముసునూరు బాలికల గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి సోమవారం తెలిపారు. ఆగిరిపల్లిలో ఆదివారం ముగిసిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో జూనియర్స్ విభాగంలో హారిక, అనూ, టాప్సీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సబ్ జూనియర్స్ విభాగంలో సౌజన్య, ఐశ్వర్య ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు చెప్పారు. పీఈటి నాగమల్లేశ్వరిని, విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

### అమెరికా సుంకాలతో తీవ్ర నష్టం

మైలవరం: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేసిన 50 శాతం సుంకాలు మన దేశ ఎగుమతులపై ప్రభావం ఉంటుందని అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.కె.కరీముల్లా తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి అధ్యక్షతన జరిగిన ట్రంప్ టారిఫ్, భారతదేశం ముందుకు సాగే మార్గం అనే అంశంపై సోమవారం సెమినార్ జరిగింది. ఈ సదస్సులో కరీముల్లా మాట్లాడుతూ ట్రంప్ సుంకాల వల్ల ముఖ్యంగా తీరప్రాంతాల రాష్ట్రాల్లో సముద్ర ఉత్పత్తులకు ఎక్కువ నష్టం కలుగుతుందని తెలిపారు. బెంగుళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్సార్ కేశవరావు మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్ వల్ల మన దేశంలో వస్తు పరిశ్రమ ఆభరణాలు, తోళ్ళ వస్తువులు, రసాయన వస్తువులపై అధిక ప్రభావం ఉంటుందన్నారు. ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు, ఐక్య కోఆర్డినేటర్ బి. సుభాషిణి, డాక్టర్ జి.రాముడు, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# శిథిలమైన చెక్ డ్యాంలు

- నిరుపయోగంగా సాగునీటి పథకాలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- సాగుకు దూరంగా ఎస్సీ రైతుల పొలాలు

అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు శాపం



గానుగపాడు కట్టిలేరుపై శిథిలమైన చెక్‌డ్యాం

తిరువూరురూరల్: ఎస్సీ సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు తిరువూరు మండలంలో గతంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు, చెక్‌డ్యాంలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. తిరువూరు మండలంలోని గానుగపాడు, చింతలపాడు గ్రామాల పరిధిలో కట్టిలేరు, గుర్రపు వాగులపై నాలుగు చెక్‌డ్యాంలను 1990లో నిర్మించారు. గానుగపాడు వద్ద కట్టిలేరు వంతెనకు ఇరువైపులా ఉన్న చెక్‌డ్యాంలు ఇసుక తరలింపునకు ఇష్టారాజ్యంగా వచ్చే ట్రాక్టర్ల కారణంగా పూర్తిగా ధ్వంసమైపోయాయి. చెక్‌డ్యాంలకు అనుబంధంగా నిర్మించిన ఎత్తిపోతల పథకాలు సైతం కనీస నిర్వహణకు నోచుకోక మూలపడ్డాయి.

**బీళ్లుగా మారుతున్న పొలాలు**

తిరువూరు మండలంలోని ఎస్సీ రైతులకు ఉన్న పొలాలకు సాగునీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాధారంతో పండే పంటలు మినహా లాభదాయక వ్యవసాయం చేయలేక సన్న, చిన్నకారు రైతుల భూములు బీళ్లుగా మారుతున్నాయి. ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, గానుగపాడు, టేకులపల్లి, చౌటపల్లి, చిక్కుళ్లగూడెం, పల్లెర్లమూడి గ్రామాల్లో రైతులు ఎత్తిపోతల పథకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

**'కోనేరు' హయాంలో నిర్మాణం**

తిరువూరు మండలంలో ఎస్సీ రైతులకు చెందిన భూములు సాగులోకి తీసుకురావడానికి గతంలో తిరువూరు ఎమ్మెల్యేగా ఉన్న కోనేరు రంగారావు చొరవతో ఎరుకోపాడు, ముష్టికుంట్ల, చౌటపల్లి, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను నిర్మించగా, వీటిలో ముష్టికుంట్ల మినహా మిగిలినవి ప్రారంభానికి నోచలేదు. ఈ పథకాలకు గతంలో ఎస్సీ కార్పొరేషన్ నుంచి మంజూరు చేసిన పైపులైన్లు, కరెంటు మోటార్లు ఏమయ్యాయో అధికారులు సైతం చెప్పలేని పరిస్థితి నెలకొంది.



**మరమ్మతులు చేయాలి**

ఎస్సీ రైతుల భూములకు సాగు నీరందించడానికి గతంలో నిర్మించిన ఎత్తిపోతల పథకాలను దీర్ఘకాలంగా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వీటికి వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. పైపులైన్లు, మోటార్లు సైతం అపహరణకు గురైనందున కొత్తవి ఏర్పాటు చేయాలి.

– కుటుంబరావు, సర్పంచి, ఆంజనేయపురం



**కొత్త చెక్‌డ్యాంలు అవసరం**

సాగునీటి సరఫరా మెరుగుపరచడానికి వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు శిథిలమయ్యాయి. వాటి స్థానంలో కొత్త చెక్‌డ్యాంలు నిర్మించాలి. ఎస్సీ రైతుల భూములకు సాగు నీరందించడంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– శివయ్య, రైతు, ముష్టికుంట్ల

## వడ్డెరలు రాజకీయంగా ఎదగాలి

వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాస్



గుంజ శ్రీనివాస్‌ను సత్కరించిన వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వడ్డెరలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదగాలని కొండపల్లి మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాస్ సూచించారు. వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన కొండపల్లిలో సోమవారం రాజకీయ చైతన్య సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో గెలుపోటములను నిర్దేశించే స్థాయిలో వడ్డెర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 27వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలు వడ్డెర్లకు పార్టీ పదవులు, రాజ్యాంగబద్ధమైన పదవులు, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర్లు పోటీ చేసే అవకాశం కల్పించాలని అన్నారు. అనంతరం వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు గుంజ శ్రీనివాస్‌ను సత్కరించారు.

## పుల్లూరు హోమియో ఆసుపత్రిని తెరవాలి: సీపీఎం

మైలవరం: మండలంలోని పుల్లూరు గ్రామంలో గత ఆరు నెలలుగా మూతబడిన హోమియో వైద్యశాలను తెరవాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండలం కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ఆరు నెలలుగా వైద్యాధికారి లేకపోవడంతో ఆసుపత్రి మూతబడి ఉన్నా అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మైలవరం మండలంతో పాటు ఏ.కొండూరు మండలం నుంచి కూడా ప్రతి రోజు ఈ ఆసుపత్రికి రోగులు వస్తుంటారని తెలిపారు. వైద్యులు లేకపోవడంతో రోగులు వెనుదిరిగి పోతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి హోమియో వైద్యశాలలో డాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, రావూరి రమేష్‌బాబు, లంక వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి, వజ్రాల ధనలక్ష్మి, ఏ.కొండూరు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆగిరిపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న మండలంలోని ఈదులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అంకం వెంకటేశ్వరరావును, అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భార్య కొవ్వలి కోటమ్మను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈదులగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ వినూత్న



అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. వెంటనే పరిష్కరించగలిగే సమస్యను కూడా కావాలని కాలయాపన చేయొద్దన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి 73 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఎస్‌డబ్ల్యూఓ డి.శ్రీనివాసరావు, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఇన్‌ఛార్జి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.వి. సత్యప్రసాద్, సీడీపీఓ పిల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ సమావేశానికి అధికారుల గైర్హాజరు



మండల పరిషత్ సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

తిరువూరురూరల్: తిరువూరు మండల పరిషత్ సమావేశానికి అధికారులు గైర్హాజరవడంపై సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పలు శాఖల అధికారులు రాకపోవడంపై జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి అభ్యంతరం తెలిపారు. గ్రామస్థాయిలో సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి ఏర్పాటు చేసే సమావేశంలో అధికారులు లేకుండా చర్చించడం ఎందుకని ప్రశ్నించారు. విద్యుత్, అటవీశాఖ, ఉద్యానవన, రోడ్లు భవనాల శాఖ, జలవనరుల శాఖ, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ఎక్సైజ్ శాఖల అధికారులకు ముందస్తుగా సమావేశపు నోటీసును పంపినా రాకపోవడంతో తాము సమావేశం బహిష్కరిస్తున్నట్లు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రకటించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు షోకాజు నోటీసు జారీ చేస్తామని ఎంపీడీవో రవిబాబు వారికి తెలిపారు.

**ప్రొటోకాల్ పాటించరా.?**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తిరువూరు మండలంలో జరిగే కార్యక్రమాలను ప్రజాప్రతినిధులకు అధికారులు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తున్నారని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ప్రజలు ఎన్నుకున్న సర్పంచులు, ఎంపీటీసీలను ప్రొటోకాల్ ప్రకారం ఎందుకు పిలవట్లేదని అధికారులను నిలదీశారు. టీడీపీ నాయకులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానిస్తూ, ప్రజాప్రతినిధులను ఎందుకు పిలవట్లేదని ప్రశ్నించారు.

## సంక్షిప్తం

**■ యూరియా పంపిణీ పరిశీలన**

నూజివీడు: మండలంలోని తుక్కులూరు సొసైటీలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ గుగులోతు బద్రు నాయక్, వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు సోమవారం పరిశీలించారు. రైతులందరికీ సక్రమంగా యూరియాను పంపిణీ చేయాలని వారు సూచించారు. ఏఓ చెన్నారావు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 51 మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీలో అందుబాటులో ఉందని, మరో 25 టన్నుల యూరియా కోసం మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ పెట్టామని తెలిపారు.

**■ అధిక యూరియాతో చీడ పీడలు**

ముసునూరు: అధిక మోతాదులో యూరియా వాడితే పంటలను చీడ పీడలు ఆశించే ప్రమాదం ఉందని మండల వ్యవసాధికారి ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. ముసునూరు పీఏసీఎస్‌లో సోమవారం యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్‌లతో పాటు, గోడౌన్ వద్ద 42 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఆయిల్ పామ్, పండ్ల తోటల్లో నానో యూరియాను డ్రిప్ పద్ధతిలో వాడుకోవచ్చని సూచించారు.

**■ ఫర్నిచర్ బహూకరణ**

ఆగిరిపల్లి: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయానికి ఎస్‌టీయూ మండల శాఖ కార్యదర్శి వి.ఇందిర దంపతులు రూ.10 వేల విలువైన ఫర్నిచర్ అందజేశారు. ఆమెను మండల విద్యాశాఖ అధికారులు హేబేలు, ఆనంద్‌కుమార్ అభినందించారు. ఎస్‌టీయూ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చౌటపల్లి సురేష్, మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి కొవ్వలి కోటమ్మ పాల్గొన్నారు.

**■ 250 మందికి వైద్య పరీక్షలు**

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎం చర్చి, క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్, మదర్ థెరిసా ప్రేయర్ మినిస్ట్రీస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఉచితంగా 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోహన్, డాక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

**■ నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి**

నూజివీడు: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కోరుతూ నూజివీడు సాధన సమితి నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్నకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సాధన సమితి గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ నూజివీడు ప్రాంతం సీఆర్‌డీఏ పరిధిలో ఉందని, భవన నిర్మాణాల అనుమతి కోసం సీఆర్‌డీఏ కార్యాలయానికి, పరిపాలన పనుల కోసం ఏలూరుకు వెళ్లాల్సి వస్తోందని, అలా కాకుండా ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉండేలా ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కోరారు.

**■ నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా అంజనేయులు**

నూజివీడు: నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పీడీ ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులను ఉన్నతాధికారులు పదోన్నతిపై నూజివీడు డిపో మేనేజర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేసిన డీఎం సీహెచ్ సూర్య పవన్ కుమార్ విజయవాడ డిపోకు బదిలీ అయ్యారు.

# యూరియా సరఫరాలో కూటమి విఫలం

మండుటెండలో రైతులకు తప్పని తిప్పలు



గంపలగూడెం మండలం గుళ్లపూడి సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

తిరువూరు: పంటలకు అవసరమైన యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం గంపలగూడెం మండలంలోని గుళ్లపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి, గంపలగూడెం గ్రోమోర్ కేంద్రానికి యూరియా వస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో ఉదయం నుంచి రైతులు పడిగాపులు పడ్డారు. మండుటెండలో వేచి ఉండలేక వృద్ధులు, మహిళలు తమ పాదరక్షలు క్యూలైన్లో ఉంచి చెట్ల కింద తలదాచుకున్నారు. యూరియా కోసం వచ్చిన రైతులకు కనీసం మంచినీరు కూడా అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంపలగూడెం, గుళ్లపూడి, ఆర్లపాడు, కొణిజెర్ల, పెనుగొలను, గ్రామాల్లో 80 టన్నుల యూరియా సరఫరా చేశారు. ఒక్కొక్క రైతుకు ఒక బస్తా మాత్రమే అందజేయడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

**తక్షణమే యూరియా అందించాలి**

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, కౌలు రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటాపంచల జమలయ్య మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వివిధ పంటలు పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో యూరియా అందకపోవడంతో దిగుబడులు తగ్గుతాయని ఆందోళన తెలిపారు. సీపీఐ నాయకుడు చలసాని రామారావు మాట్లాడుతూ యూరియా లేక రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, కార్యవర్గ సభ్యులు మడుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరావు, పార్టీ నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, బొప్పుడి రాంబాబు, ఆకునూరి విఘ్నేష్, అరికోటి రామారావు, ఒగ్గు ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.





గంపలగూడెం గ్రోమోర్ సెంటరు వద్ద రైతుల పడిగాపులు



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, కౌలు రైతు సంఘం నాయకులు

**తిరువూరులో సీపీఐ ఆందోళన**

తిరువూరు: యూరియా, డీఏపీ అందక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతుంటే కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకోవట్లేదని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తూము కృష్ణయ్య ఆరోపించారు. ఎరువుల కొరత నివారించడంలో ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తిరువూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. రోజుల తరబడి పీఏసీఎస్‌లు, గ్రోమోర్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ఒక్క బస్తా యూరియా కూడా అందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే యూరియా సరఫరా మెరుగుపరచాలని కోరుతూ తహసీల్దారు ఉదయభాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ నాయకులు ఉదయ్, అశోక్, సుబానీ, ముత్తయ్య, హసన్ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

**అధికారుల పర్యవేక్షణలో పంపిణీ**

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో సోమవారం సహకార సొసైటీలు, ప్రయివేటు ఎరువుల దుకాణాల్లో యూరియా పంపిణీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగింది. రైతులకు సరిపడా యూరియా ఇవ్వడం లేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## గంపలగూడెంలో ధర్నా





గంపలగూడెంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరువూరు: యూరియా కోసం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం గంపలగూడెంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు జి.రామకృష్ణ, వి.గోపయ్య, పి.ప్రకాశరావు, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## హామీలు అమలు చేయాలి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం కావడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు యూరియా అందించలేని దిక్కుమాలిన ప్రభుత్వమని విమర్శించారు. జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, మండల కార్యదర్శి కలకోటి బసవయ్య, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చీరలకు వేలం

నూజివీడు: పట్టణంలో వేంచేసియున్న శ్రీకోట మహిషాసుర మర్దిని అమ్మవారి దేవస్థానంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయం, అమ్మవారికి భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలు పోగు చేసుకొనుటకు, చీర, జాకెట్ ముక్కలు సేకరించుకునేందుకు సోమవారం వేలం నిర్వహించారు. ఈఓ అలివేణి సమక్షంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయం, కొబ్బరి చెక్కలు పోగు చేసుకొను హక్కుకు నూజివీడుకు చెందిన ఎన్.గంగమ్మ రూ.1,15,500లకు పాడుకొంది. భక్తులు సమర్పించిన చీర, జాకెట్ ముక్కలు సేకరించుకునేందుకు నూజివీడుకు చెందిన కొచ్చర్లకోట వెంకట సత్యమూర్తి రూ.1,37,000కు పాడుకున్నారు.